ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025 5 విజయనగరం

మగ బిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి

ముంచేసిన మొంథా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మొంథా తుపాను రెండో రోజు మంగళవారం భీభత్సం సృష్టించింది. ఓవైపు భారీ వర్షం, మరోవైపు పెనుగాలులు జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగించాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 956 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. గాలులకు అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలు చిగురుటాకుల్లా వనుకుతున్నాయి. పలు మండలాల్లో వరి పంట నీటమునిగింది. వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం జిల్లాలో 12 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీనికితోడు పలు చోట్ల విద్యుత్ ఫీడర్స్ దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడా చెట్లు, చాలా చోట్ల కొమ్మలు వంటివి విరిగిపోయాయి. మరోవైపు అధిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముంపు సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ అధికారులు జలాశయాల గేట్లను ఎత్తివేశారు. చెరువుల్లో మదుములను కూడా రైతులు పూర్తిగా తెరిచివేశారు. అయినప్పటికీ పలు చోట్ల రోడ్లు, గట్లపై నుంచి నీరు పారడం వంటి పరిస్థితి ఏర్పడింది.

- ఉమ్మడి జిల్లాలో 956 ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో వరి రైతులు
- విజయనగరం జిల్లాలో దెబ్బతిన్న 13 ఇళ్లు
- మరమ్మతులకు గురైన 11కెవి, 33కెవి ఫీడర్లు
- నేలకొరిగిన 12విద్యుత్ స్తంభాలు
- పునరావాస కేంద్రాలకు పలువురు తరలింపు

విజయనగరంటౌన్ : పెద్ద చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి, కమిషనర్

విజయనగరం జిల్లాలో 12 మండలాల్లో 447 మంది రైతులకు చెందిన 706 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల తీవ్రంగా వీచిన గాలులకు చేను నేలకు ఒరిగిపోయింది. మన్యం జిల్లాలో సాలూరు, మక్కువ, పాచిపెంట, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. ఈ మండలాల్లో సుమారు 250 ఎకరాల్లో వరి, తదితర పంటలు నీట మునిగాయి. రెండు జిల్లాల్లోనూ ఉద్యాన పంటల నష్టం అంచనా ప్రస్తుతం లేకపోయినప్పటికీ, తీగజాతి కూరగాయల పంటలు బాగా దెబ్బతినే అవకాశం కనిపిస్తోంది. గాలులకు అరటి, బొప్పాయితోట విరిగిపోయే ప్రమాదం ఉందని సంబంధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొండపల్లి, విజయనగరం, డెంకాడ, పూసపాటి రేగ మండలాల్లో 13 ఇళ్లు దెబ్బతిన్నాయి. గంట్యాడ, గుర్ల, నెలిమర్ల, విజయనగరం మండలాల్లో పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో 9 చెరువులు ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చీపురుపల్లి మండలంలో రెండు కోళ్ల ఫారాలు, బొండపల్లి, భోగాపురం పశువుల శాలలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోగా, అత్యధికంగా వంగర మండలంలోనే ఎనిమిది స్తంభాలు ఉన్నాయి. 11కెవి ఫీడర్స్ 6, 33కెవి ఫీడర్స్ 3 చొప్పున మరమ్మతులకు గురయ్యాయి. తుపాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. విజయనగరం జిల్లాలో 102 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాకు నియమితులైన ప్రత్యేకాధికారి రవి సుభాష్ పట్టంశెట్టి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్, జెసి సేధుమాదవ్ తదితర పలు మండలాల్లో పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

సంతకవిటి : మొంథా తుపాను మండలంలో వరి పంటను తుపాను ఒక్కసారిగా ముంచేసింది. చేతికి అందిన వరి పంట నేలకొరగడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. అప్పులు చేసి కష్టపడి పండించిన పంట చేతికి అందేసమయంలో నేలకొరగడంతో మంతిన, మల్లయ్యపేట, కొండగూడెం, జావాం, సిరిపురం, కావలి, వాల్తేరు, మామిడిపల్లి, మండవ కురిటి, వాసుదేవపట్నం తదితర గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు.

సంతకవిటి మండలంలో నేలకొరిగిన వరిచేలను నిలబెడుతున్న రైతులు

కొత్తవలస మండలం తమ్మికాపల్లిలో నీట మునిగిన వరిపంట

నీట మునిగిన వరిపంట

నెల్లిమర్ల : ఎటి అగ్రహారంలో మీసాల శ్రీనుకు చెందిన రెండు ఎకరాలు వరిపంట నీట మునిగింది. గాలికి వరిపంట చాపచుట్టి నేలకొరిగింది. వర్షాలు ఇంకా ఎక్కువైతే పంట చేతికి రాదు సరికదా రైతులు నట్టేట మునగడం ఖాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పూసపాటిరేగ : ఈదురుగాలులకు గోవిందపురంలో బొప్పాయి తోట నేలమట్టమయ్యింది. చింతపల్లి తీరాన్ని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పరిశీలించారు. అనంతరం గోవిందపురానికి చెందిన కొల్లి సూరి అనే రైతుకు చెందిన బొప్పాయి, మిరప పంట నేలకొరగడంతో వాటిని పరిశీలించారు.

'మడ్డువలస' ఆరు గేట్లు ఎత్తివేత

వంగర : మడ్డువలస ప్రాజెక్టు ఆరు గేట్లను అధికారులు ఎత్తివేశారు. 14వేల క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచి పెడుతున్నట్లు ప్రాజెక్ట్ ఎఇ కె.నితిన్ తెలిపారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుండి గంట గంటకూ భారీగా పెరిగి వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుండడంతో 6గేట్లు ఎత్తివేసి నీటిని దిగివకు విడిచి పెడుతున్నామన్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 65మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 63.68 లెవెల్ నీటిమట్టం ఉందని వెల్లడించారు.

ఆంధ్ర ప్రాజెక్టులో పెరిగిన నీటి మట్టం

మెంటాడ : ఆంధ్ర జలాశయం గరిష్ట నీటి మట్టం 146మీటర్లు కాగా, ప్రస్తుతం 144.90మీటర్లుకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయం లోకి వరద నీరు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో 800 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

వర్షపాతం వివరాలు

విజయనగరంకోట : మొంథా తుపాను ప్రభావంతో జిల్లాల మంగళవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సరాసరి 41.5మి.మీ. వర్షం కురిసింది. అత్యధికంగా శృంగవరపుకోట మండలంలో 88.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.జామి, ఎల్.కోట, బొండపల్లి, మెంటాడ మండలాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. మండలాల వారీగా వర్షపాతం వివరాలు...

మండలం	వర్షపాతం (మి.మీ.లో)
వంగర	32.8
రేగిడి	36.2
సంతకవిటి	44.4
రాజాం	39.2
బొబ్బిలి	28.2
రామభద్రపురం	24.2
బాడంగి	42.0
తెర్లాం	38.8
మెరకముడిదాం	48.6
దత్తిరాజేరు	29.8
మెంటాడ	56.8
గజపతినగరం	19.6
గరివిడి	31.4
చీపురుపల్లి	38.0
గుర్ల	27.8
బొండపల్లి	59.0
గంట్యాడ	46.2
ఎస్.కోట	88.6
వేపాడ	44.4
ఎల్.కోట	57.6
కొత్తవలస	44.0
జామి	83.6
విజయనగరం	30.2
నెల్లిమర్ల	30.6
పూసపాటిరేగ	33.2
డెంకాడ	21.8
భోగాపురం	44.8

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

విజయనగరం కోట : విజయనగరం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు తుపాను ప్రభావం వల్ల రద్దయ్యాయని స్టేషన్ మాస్టర్ విబి రావు తెలిపారు. బుధవారం ట్రైన్ నెంబర్ 17220 విశాఖపట్నం-మచిలీపట్నం, 17244 రాయగడ-గుంటూరు, 07166 భువనేశ్వర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.18464 బెంగుళూర్- భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈనెల 30న 18520 విశాఖ-ముంబాయి ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 11019 ముంబయి -భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 17479 పూరి- తిరుపతి రైళ్లు రద్దయ్యాయి.

తాటిపూడి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎస్‌పి

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్‌ను ఎస్‌పి దామోదర్ మంగళవారం పరిశీలించారు. రిజర్వాయర్‌లో చేరిన నీటి మట్టం, ప్రమాద స్థాయిని పరిశీలించారు. . రిజర్వాయరు నుండి నీటిని విడుదల చేస్తే రిజర్వాయరు కింద ఏమైనా ముంపు గ్రామాలుంటాయా అని అధికారులను ప్రశ్నించారు. అనంతరం గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమీక్షించారు. ఇంఛార్జి డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ పాల్గొన్నారు.

సహాయక చర్యల కోసం గర్భిణీ ఎదురుచూపు

కలెక్టర్ చొరవతో కదిలిన వైద్య సిబ్బంది
ఆస్పత్రికి తరలింపు...మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి
వైద్య సిబ్బందిని అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-మెంటాడ, గజపతినగరం

నిండు గర్భిణీ ..పురిటి నొప్పులతో బాధపడుతుంటే...సహాయం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూశారు...నదిని దాటే సాహసం చేయలేక .. రవాణా సౌకర్యం లేక..కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అంతలోనే ఎఎన్ఎం, ఆశా కార్యకర్త సురక్షితంగా గజపతినగరం ఆసుపత్రికి అంబులెన్స్‌లో చేర్చగా ఆపరేషన్ చేసి డెలివరీ చేశారు. ఆ తల్లి పండంటి మగబిడ్డకు జన్మనివ్వడం తో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.

మెంటాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గర్భిణీ మీసాల పార్వతికి వైద్యులు నవంబర్ 20 డెలివరీ తేదీగా ఇచ్చారు. అయితే ఆమెకు మంగళవారం నొప్పులు ప్రారంభమయ్యాయి. చంపావతి నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. నదిని దాటి వెళ్లే సాహసం చేయలేదు. గ్రామానికి 108 వాహనం వెళ్లే పరిస్థితి లేదు. సహాయక చర్యలు కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులకు వైద్యసిబ్బంది అండగా నిలిచారు. ఆంధ్ర వరకు గ్రామస్తుల సహకారంతో తీసుకు రాగా. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడి నుండి 108 వాహనం లో వైద్య సిబ్బంది గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో చేర్చి సిజేరియన్ చేశారు. పార్వతి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సరైన సమయంలో సరైన విధంగా స్పందించి సుఖంతం చేసినందుకు వైద్య సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

గర్భిణులను ఆస్పత్రికి తరలింపు

గజపతినగరం : మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు గర్భిణులను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం హాస్పిటల్‌కు తరలించారు. పిహెచ్‌సి వైద్య అధికారులు సాయి కృష్ణారెడ్డి, అంజలి మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవంబర్ 5లోపు డెలివరీకి సిద్ధంగా ఉన్న గర్భిణులను గుర్తించి వారిని స్థానిక ఎఎన్ఎం, ఆశా వర్కర్ల సహాయంతో సమీప హాస్పిటల్ కి తరలిస్తున్నామని తెలిపారు. తుపాను దృష్ట్యా స్థానిక వైద్య సిబ్బంది సచివాలయాల్లో రాత్రి వేళల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

చింతపల్లి గ్రామంలో అధికారులు, ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

తీరంలో అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

పూసపాటిరేగ: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని చింతపల్లి సముద్ర తీరాన్ని ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కలిసి పరిశీలించారు. తీరంలో సముద్రం పరిస్థితిని పరిశీలించారు. ఈ రాత్రికి తుపాను తీవ్రత అధికంగా ఉంటుందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు, ప్రజలతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల భద్రత కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఎంపిడిఒ రాధిక తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కొండపల్లి

కంటోన్మెంట్ : తుపానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యవేక్షించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. ఏర్పాట్లపై సమీక్షించారు. సన్నద్ధతను కలెక్టర్ రామసుందర్ రెడ్డి మంత్రికి వివరించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

పునరావాస కేంద్రాల్లో వసతుల కల్పన

- జిల్లా తుపాను ప్రత్యేకాధికారి రవి సుభాష్
- పలు మండలాల్లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి-గుర్ల, గరివిడి, చీపురుపల్లి

మొంథా తుఫానును దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన 71 పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని జిల్లా తుపాను ప్రత్యేకాధికారి రవి సుభాష్ పట్టంశెట్టి ఆదేశించారు. కాల్‌సెంటర్లతో పాటు సచివాలయాలు, పునరావాస కేంద్రాల్లో కూడా ప్రభుత్వ సిబ్బంది షిఫ్టులవారీగా 24 గంటలూ విధులను నిర్వహించాలని స్పష్టం చేశారు. రేషన్ సరుకులు, తాగునీరు, మందులు, ఇతర అవసరమైన వస్తువులన్నటినీ సిద్దంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన గుర్ల, గరివిడి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఆయన మంగళవారం విస్తతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలను, సచివాలయాలను తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.

గుర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పేటలో ఆయన పర్యటించారు. లోతట్టు ప్రాంతంలో నీరు చేరేటప్పుడు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఆదేశించారు. ఆనందపురం కల్వర్టును పరిశీలించి, కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించే సమయంలో రాకపోకలను నిలిపివేయాలని సూచించారు. ఆనందపురం గ్రామంలోని గురునాయుడు చెరువును పరిశీలించారు. గండిపకుండా తగిన చర్యలను చేపట్టాలని, ముందుగానే ఇసుక బస్తాలను సిద్దంచేసి ఉంచాలని ఆదేశించారు. గరివిడి బంగారమ్మ కాలనీలో ప్రత్యేకాధికారి పర్యటించారు. ఇనుప విద్యుత్ స్థంభాలను మార్చాలని, అసంపూర్తిగా వదిలేసిన కాలువను పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. దీంతో వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గరివిడి, చీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు.పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాదవన్, ఆయా మండలాల తాహశీల్దారులు ఆదిలక్ష్మి, బంగార్రాజు, ధర్మరాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రవి సుభాష్

ముప్ప ప్రాంతాల వారిని తక్షణమే తరలించాలి

కంటోన్మెంట్ : ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉన్నవారిని తక్షణమే తరలించాలని జిల్లా స్పెషలాఫీసర్ రవి సుభాష్ పట్టంశెట్టి ఆదేశించారు. వృద్ధులను, పాత ఇళ్లు, పాడు పడిన ఇళ్లల్లో ఉన్నవారిని, పాకల్లో ఉన్న వారిని తప్పకుండా పునరావాస శిబిరాలకు చేర్చాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారి బంధువుల ఇళ్లకు వెళతామని చెప్పేవారిని వారి బంధువుల ఇళ్ల వద్దకే సురక్షితంగా చేర్చాలని ఆదేశించారు. తుపాను చర్యల పై టెలి కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకాధికారితో పాటు కలెక్టర్ రామసుందర్ రెడ్డి మంగళవారం అధికారులతో సమీక్షించారు. గర్భిణులను గుర్తించి వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, నెలలు నిండిన వారిని సమీప పిహెచ్‌సి లేదా సిహెచ్‌సి ల్లో చేర్పించాలని, వారికి అవసరమగు మందులు ఆహారాన్ని అందించాలని తెలిపారు. శిబిరాల్లో చేర్చిన వారికి ఆహారం, తాగు నీరు,ఇతర అవసరాలను సమకూర్చాల ని అన్నారు. చెరువుల్లో చేరే ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో పై దృష్టి సారించాలని, గండ్లు పడితే ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇసుక బస్తాలు, వాహనాలు, సిబ్బంది బలహీనంగా ఉన్న చెరువుల వద్ద అవసరమగు సామగ్రి తో పొజిషన్ లో ఉండాలని, ఇరిగేషన్ అధికారులతో పాటు రెవిన్యూ అధికారులు కూడా ఉండాలని తెలిపారు. ప్రమాదం సంభవిస్తే తప్పించు కునే అవకాశం ఉండేలా పశువులను కట్టకుండా ఉంచాలని కలెక్టర్ తెలిపారు.

విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొంటాం

ఆకస్మిక తనిఖీలలో నలుగురు అధికారులకు షోకాజ్

ప్రజాశక్తి-గజపతినగరం, విజయనగరంటౌన్

మొంథా తుపాను నేపథ్యంలో ఎటువంటి విపత్తులైన సమర్ధవంతంగా ఎదుర్కోటానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ ఎస్ రాసుందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌పి ఎఆర్ దామోదర్‌తో కలిసి పెద్ద చెరువు, ట్యాంక్ బండ్ రోడ్లను పరిశీలించి మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా కాలువలు స్టాగ్నేషన్ లేకుండా నీరు సజావుగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో 41 కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని, ఎటువంటి నష్టమూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, పూరి గుడిసెలు, పాడైపోయిన భవనాలలో ఉన్న వారిని పురావస కేంద్రాలకు లేదా వారి అభీష్టం మేరకు బంధువుల ఇళ్లకు తరలించడం జరుగుతోందని వివరించారు. 227 మంది పదిరోజులలో డెలివరీ కానున్న గర్భిణులను గుర్తించి, వారిని ముందుగానే ఆసుపత్రులకు తరలించడం జరిగిందని తెలిపారు. అనంతరం బొండపల్లి, గజపతినగరం మండలాలకు చేరుకున్న కలెక్టర్ తాహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములను పరిశీలించారు. విధుల కేటాయింపు, విధుల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ చేయాల్సిన, మండల ప్రత్యేక అధికారులు తుపాను లాంటి విపత్కర పరిస్థితుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. బొండపల్లి, గజపతినగరం తాహశీల్దార్లకు, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పట్టు పరిశ్రమ సహాయసంచాలకులు, జిల్లా కోపరేటివ్ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

గజపతినగరం : తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పునరావాస కేంద్రాలకు 59 మంది తరలింపు

విజయనగరంకోట,కంటోన్మెంట్

తుపాను ప్రభావంతో విజయనగరం మండలం పరిధిలో ఏర్పాటు చేసిన ఐదు పునరావాస కేంద్రాలకు 59 మందిని తరలించినట్లు తహశీల్దార్ కూర్మనాధరావు తెలిపారు. బాబా మెట్ట పునరావాస కేంద్రంలో 12 మంది, జొన్నవలసలో 10మంది, రాకోడులో 15 మంది, పినవేమలిలో 20 మంది, గుంకలాంలో ఇద్దరు చొప్పున మొత్తం 59 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. కేంద్రాలను తహశీల్దార్‌తో పాటు ఎంపిడిఒ వెంకటరావు, ఆర్ఐ ఎస్ఎస్ఎన్ రాజు పరిశీలించారు.

మూడు కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ధర్మపురి గ్రామంలో మూడు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జలమయమైన మూడు ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిని విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆరో డివిజన్ జమ్ములో పూరిపాకలో నివసిస్తున్న దాసరి ఈశ్వరమ్మ ఇల్లు ప్రమాద స్థితిలో ఉండడంతో ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి విజయనగరం పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా రవి బాబా మెట్ట గర్ల్స్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తీసుకువెళ్లి వారికి తగు సదుపాయం ఏర్పాటు చేశారు. చెరువుల వల్ల ఎటువంటి నష్టమూ లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్‌ను కోరారు.

అత్యవసరమైతేనే ప్రయాణాలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను నిలుపుదల చేసుకోవాలని వాహనదారులకు జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ సూచించారు. జాతీయ రహదారుల్లో ప్రయాణించే భారీ వాహనాలను రాత్రి 7గంటల నుండి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు నిలుపుదల చేయాలన్నారు. అత్యవసరమైతే తప్పా ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు సూచించారు. తుపాను తీరం చేరే సమయంలో భారీగా వర్షాలు పడి, ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అధికారులతో ఎంపి సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

తుపాను నేపథ్యంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మండల స్థాయి అధికారులతో మంగళవారం టెలి కాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలని, ప్రజలకు శుభ్రమైన ఆహారం అందించాలని, వాటితోపాటు అక్కడే వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్, టెలికాం, త్రాగునీరు వంటి వాటికి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్నీ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను కారణంగా కలిగిన ఇబ్బందులను తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కెజిబివిలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్

ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి -గుర్ల

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో మంగళవారం సాయంత్రం విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగింది. సెకెండ్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినుల గదిలో ఒక్కసారిగా మంటలు వచ్చి ఫ్యాన్లు, డార్మిటరీలో పరుపులు కాలిపోవడంతో విద్యార్థులు వెంటనే నీళ్లు జల్లారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎక్కువై పోవడంతో ఐదుగురు వై శ్రావణి , జె.సుజాత, ఇ.వెంకటలక్ష్మి, జి.కృపా సంధ్య, కె.దీక్షిత అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంత 108 వాహనంలో విజయనగరం, నెల్లిమర్ల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా భారీ వర్షాలు ఉండడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పాఠశాల ఎస్ఒ జానకి తెలిపారు. చీపురుపల్లి సిఐ శంకర రావు, గుర్ల ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.కెజిబివి విద్యార్థులు క్షేమంగా ఉన్నారని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు.డార్మెటరీలో పరుపులు అంటుకొని వచ్చిన పొగతో ఐదుగురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారని తెలిపారు. వెంటనే వారిని నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ఈ సంఘటనపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పొంగుతున్న వాగులు, గెడ్డలు

పరిశీలించిన అధికారులు

విజయనగరంకోట: తుపాను ప్రభావంతో విజయనగరం మండలం పరిధిలోని గ్రామాలను, వ్యవసాయ పొలాలను, వాగులు, గెడ్డలు, చెరువులను మంగళవారం ప్రత్యేకాధికారి.... ఆధ్వర్యాన తహశీల్దార్ కూర్మనాధరావు, ఎంపిడిఒ వెంకటరావు ఆర్ఐ ఎన్ఎస్ఎస్ రాజు, ఇరిగేషన్ డిఇ గోవిందరావు తదితరులు పరిశీలించారు. గెడ్డలు, వాగులు రోడ్లపై ప్రవహిస్తున్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోరుకొండ పాలెంలో జామి నాయుడు చెరువు గట్టుకు గండి కొడుతుందేమోనని ముందు జాగ్రత్తగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. రాకోడు గెడ్డను పరిశీలించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. జొన్నవలస వద్ద చప్టాను పరిశీలించారు. కోరాడపేట, గుంకలాం చెరువులను పరిశీలించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఇ హరిత, ఆయా గ్రామాల కార్యదర్శులు, విఆర్ఎఒలు, విఆర్ఎలు, టిడిపి నాయకులు చొప్ప రామారావు పాల్గొన్నారు.

రాకోడు వద్ద గెడ్డను పరిశీలిస్తున్న అధికారులు

పొలంలో రైతన్న కన్నీరు

- అన్నదాతను ముంచేసిన మొంథా తుపాను
- పలు చోట్ల నేలమట్టమైన వరి
- వరద ఉధృతతో రాకపోకలు బంద్
- తీర ప్రాంతాల్లో అప్రమత్తమైన అధికారులు
- పునరావాస కేంద్రాలకు పలువురు తరలింపు

ప్రజాశక్తి విలేకర్ల బృందం

మొంథా తుపాను జిల్లాలో పంటలను ముంచేయడంతో రైతన్న కన్నీరు పెడుతున్నారు. ప్రధాన పంట అయిన వరిచేలు నెలకొరగడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. పంటను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాడు. వరితోపాటు మొక్కజొన్న, అరటి, బొప్పాయి, కూరగాయలుపంటలు దెబ్బతినడంతో లబోదిబోమంటున్నాడు.

దెంకాడ: వర్షపు నీరు దారి మళ్లింపును పరిశీలిస్తున్న కార్యదర్శి

భోగాపురం : మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆర్‌డిఒ దాట్ల కీర్తి మండలంలోని చేపలకంచేరు, ముక్కాం, కొండ్రాజపాలెం, రెడ్డికకంచేరు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించిన ఆర్‌డిఒ, పునరావాస కేంద్రాలను పరిశీలించి అక్కడి సౌకర్యాలను సమీక్షించారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా ఇవ్వాలి

మండలంలోని ముక్కాం గ్రామాన్ని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే

ప్రజలు ఎవరూ భయపడవద్దని ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందని తుపాను తీరం దాటే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాగమాధవి ముక్కాం గ్రామస్తులకు సూచించారు. పునరావాసం విషయంలో ఎటువంటి అలసత్వం తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చెయ్యాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట నాయకులు మైలపల్లి అప్పలకొండ, మైలపల్లి నరసింహులు, తహశీల్దార్ ఎం.రమణమ్మ, ఎంపిడిఒ స్వరూప రాణి ఉన్నారు. తుపాను రీత్యా మండలంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులను అప్రమత్తం చేశామని ఉద్యానవన అధికారిణి ఉమా భరణి తెలిపారు. ప్రత్యేకంగా అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల తోటలలో అధిక వర్షాలు, గాలుల వల్ల నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు.

నేలకొరిగిన వరి


నేలకు ఒరిగిన వరి పంట

వంగర: తుపాను నేపథ్యంలో భారీ వర్షాలతో పాటు గాలులు వీస్తుండటంతో మండలంలోని శివ్వాం, సంగాం, నీలయ్యవలస కింజంగి తదితర గ్రామాలలో వరి చేలు నేలమట్టమయ్యాయి. దాదాపు పంట కోత దశకు చేరుకుని, చేతికి అందొచ్చే సమయంలో ఇలా వరి చేలు నేలకొరిగిపోవడంతో పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఒ కన్నబాబు పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. నాగావళి నదిలో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి 13,849 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచి పెట్టడంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో గల తోటపల్లి ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 2807 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచి పెట్టడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది.

అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది

మెరకముడిదాం: మండలంలో విద్యుత్తుకు సంబంధించి ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని గర్భాం విద్యుత్ కార్యాలయం ఎఇ దివాకర్ వెల్లడించారు. మొంథాన్ తుపాను కారణంగా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేలమట్టమైన, విద్యుత్ తీగలు తెగబడినా తక్షణమే స్థానికులు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తని ఆధ్వర్యంలో మంగళవారం అన్ని గ్రామాల్లో పరిశీలన చేశామన్నారు.

గరుగుబిల్లిలో క్లోరినేషన్

మండలంలోని గరుగుబిల్లిలో సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంచినీటి బోరు బావుల్లో మంగళవారం క్లోరినేషన్ చేశారు. స్థానిక ఎంపిటిసి చిరంజీవినాయుడు, పంచాయతీ కార్యదర్శి ఇ.గౌరి నాయుడు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి

పేదలకు సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు సూచించారు. మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన అధికారులతో సమీక్షించారు. బుధరాయవలస ఎస్ఐ జె.లోకేష్ కుమార్ సిబ్బందితో పాటు చల్లాపురం, చిన్న రవ్వం గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. చల్లాపురం నుంచి చినరవ్వం వెళ్లే రోడ్, బంటవలన రోడ్డు దెబ్బతినడంతో జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. అనంతరం గర్భం, బైరపురంలో గ్రామాల్లో గల పునరావాస కేంద్రాలను సందర్శించారు.

తుపాను వల్ల రైతులకు నష్టమే

దెంకాడ: పెద్ద తాడివాడ పంచాయతీ పరిధిలో ఊడికలపేట విజయనగరం నాతవలస రోడ్లో వర్షపు నీరు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటే దానిని స్థానిక గ్రామ కార్యదర్శి చింతపల్లి అప్పలనాయుడు, శ్రీనివాసరావు జెసిబి సహాయంతో తొలగించారు. అక్కివరం పునరావాస కేంద్రాన్ని టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ పరిశీలించారు.

పెదతాడివాడ గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, మండల ప్రత్యేకాధికారి చిట్టిబాబు, సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభూషణరావు, ఎఒ టి.సంగీత రైతులకు అవగాహన కల్పించారు. చొల్లంగి పేటలో నాలుగు ఎకరాలు, రఘుమండలో 60 సెంట్లలో ప్రస్తుతం వరి నీట మునిగిందని తెలిపారు.

ఉధృతంగా పెద్ద గెడ్డ

వేపాడ: మండలంలోని సింగరాయికి చెందిన పెద్దగెడ్డ భారీ వర్షాలు కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రికి వర్షం ఎక్కువ కురిస్తే సింగరాయి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోవడం ఖాయమని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోంపురం అండర్ రైల్వే బ్రిడ్జి పరిశీలన

మండలంలోని సోంపురం అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ అండర్ బ్రిడ్జిని ఎస్ఐ మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారి స్వాతి రాణి తుపాను వల్ల కలిగే నష్ట నివారణ గూర్చి మంగళవారం రైతులకు పలు సూచనలు చేశారు.

అప్రమత్తత అవసరం: ఎమ్మెల్యే

మండలం బొద్దాంలోని యాతపేటను ఎమ్మెల్యే లలితకుమారి పరిశీలించారు. యాతపేట కుటుంబాలు వారంతా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో డిఎస్‌పి పర్యటన

తెర్లాం: బొబ్బిలి డిఎస్‌పి భవ్య రెడ్డి మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతమైన నందిగాం, గంగన్నపాడు గ్రామాల్లో పర్యటించారు. నందిగామలో ఉన్న నర్సుపల్లివాని చెరువును పరిశీలించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. అనంతరం గంగన్నపాడు గ్రామాన్ని తనిఖీ చేశారు. గత వారంలో ఒక పెద్ద వర్షం కురిసినప్పుడు ఆ గ్రామం నుంచి నీరు వీధుల గుండా పారిన సంగతి విధితమే.

పురిళ్లనుంచి పునరావాస కేంద్రానికి: మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతమైన గంగన్నపాడు గ్రామంలో పురింటిలో నివాసముంటున్న సిద్దాల దానమ్మ, గాడి సింహాచలంను పునరావాస కేంద్రానికి తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు మంగళవారం తరలించారు. వారిని తరలించిన తరువాత ఇల్లు గోడ కూలిపోయిందని తెలిపారు. పెద్ద గెడ్డ డ్యామ్ గేట్లు ఎత్తడం, నందబలగ గ్రామంలో వేగావతి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని తహశీల్దార్ తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గృహ సందర్శనలు చేసి గర్భిణులకు, బాలింతలకు పాలు, గుడ్లు అందజేశారు.

అధికారుల అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

చీపురుపల్లి: అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అధికారులను కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో తుపానుపై సమీక్ష జరిపారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో ఆర్‌డిఒ జీవి సత్యవాణి, డిఎస్‌పి రాఘవులు, డిఎల్‌డిఒ హేమసుందర్, డివిజన్ పరిధిలో ఉన్న అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరుగా ప్రవహిస్తున్న నాగావళి

సంతకవిటి: మండలంలోని నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి వరదనీరు జోరుగా ప్రవహిస్తుంది. తోటపల్లి, మడ్డువలస జలాశయాల నుంచి నారాయణపురం ఆనకట్టకు నీరు విడుదల చెయ్యడంతో 12 వేల క్యూసెక్కుల వరదనీరు వృధాగా సముద్రంలోకి పోతోంది. ఆనకట్ట మీదుగా వరదనీరు జోరుగా ప్రవహిం చడంతో రంగరాయపురం, కె.ఆర్‌పురం, జావాం, తమరాం తదితర గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందు తున్నారు. ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని, సిరిపురం గ్రామంలోని పెద్ద చెరువు, రెల్లి గెడ్డను తహసీల్దార్ బి. సుదర్శన్ రావు పరిశీలించారు. కొత్తూరు రామచంద్ర పురం, వాసుదేవపట్నం, పి.జేపేట గ్రామాలను ఎస్ఐ ఆర్.గోపాల రావు సందర్శించి ప్రజలకు వరద నీటి పై అవగాహన కల్పించారు. నాగావళి నదీ తీర పిజేపేట, వాసు దేవట్నం, పోడలి, తమరాం ప్రాంతాలను ఎంఇఒ బి. శాంతి కుమారి సందర్శించారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే కిమిడి

ఇంజన్‌తో తోడుతున్న నీరు

గుర్ల: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూరిభా, గురుకుల పాఠశాలలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్లుతో మాట్లడుతూ పిహెచ్‌సి పరిధిలో గర్భిణులను గుర్తించి వారికి తగిన వైద్యం అందిస్తూ, నిరంతరం వారిని పర్యవేక్షణ చేయాలన్నారు. డెలివిరి సమయం దగ్గరగా ఉన్న వారిని అందుబాటులో ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు.

ఇంటి పేట గ్రామం లో నీటమునిగిన వరి పంటను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మాలిక్ నాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు, టిడిపి నాయకులు మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహశీల్దార్ ఆది లక్ష్మీ, ఎంపిడిఒ రవి కుమార్, డాక్టర్లు శ్రీకాంత్ వెంకట మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ పేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, తారకరామ తీర్థ సాగర్ బెరేజిని జిల్లా ప్రత్యేక అధికారి రవి, జెసి సేతు మాధవన్‌లు పరిశీలించి, నది పరివాహక గ్రామ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు

మండలంలో కెల్ల రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి దిగువన నీరు చేరడంతో గ్రామస్తుల రాక పోకలు నిలిచిపోయాయి. నీటిని తొలగించడానికి నానా అవస్థలు పడ్డారు. ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తొలగించారు.

రోడ్డుపై కూలిన చెట్టు

గంట్యాడ : రామభద్రపురం ఆర్అర్‌అండ్‌బి రోడ్డుపై మంగళవారం కూలిన చెట్టును, విద్యుత్ స్తంభాన్ని సిబ్బంది జెసిబితో తొలగించారు. విజయనగరం నుండి ఎస్.కోటకు రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ రమణ మూర్తి, విద్యుత్ శాఖ ఎఇ శ్రీనివాస్‌రావు, ఎపిఒ సుందర్ రావు, ఎస్ఐ సాయి కృష్ణ పాల్గొని పర్యవేక్షించారు. సిరిపురం, చంద్రంపేట గ్రామాలను తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి మంగళ వారం పరిశీలించారు. ఎనిమిది కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలోని నివాసాన్ని కల్పించారు.

విస్తారంగా కురిసిన వర్షం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం విస్తరంగా వర్షం కురిసింది. వర్షానికి కంకెతో ఉన్న వరిపంట అక్కడక్కడ నేలకొరిగింది. వర్షం కురవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో వరదనీరు

ఎం.బూర్జవలస వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో వరదనీరు నిల్వ ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపెంట, ఎం.పణుకువలస గ్రామస్తులు, గ్రోత్ సెంటర్ పరిశ్రమలకు వెళ్లే కార్మికులు అండర్ బ్రిడ్జి లోపల నుంచి రాకపోకలు చేస్తున్నారు. నీరు ఉండడంతో వాహనాలు మరమ్మతులకు గురై నీటి మధ్యలో ఆగిపోతున్నాయి. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పురాతన భవనాలలో నివాసం లేకుండా చూడాలి

మున్సిపాలిటీలో పురాతన భవనాలలో ఎవరు నివాసం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు కోరారు. తన ఛాంబర్‌లో మంగళవారం సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో లోతట్టు ప్రాంతాలలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పర్యటించారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

రాజాం: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ పరిశీలించి, అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. పునరావాస శిబిరాలను సిద్ధం చేశామని, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఓమ్మి, లక్ష్మీపురం గ్రామాల్లో నీట మునిగిన వరిపంటను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి : ఆర్‌డిఒ

బొబ్బిలిరూరల్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ, డిఎస్‌పిలు రామ్మోహన్‌రావు, భవ్యరెడ్డి సూచించారు. మంగళవారం పారాది, కారాడ గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిలు యం.శ్రీను, పి.రవికుమార్, ఏ.భాస్కరరావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి, ఎఒలు మధుసూదనరావు, శ్యాంసుందర్‌లు సూచించారు. మంగళవారం మండలంలోని కాసింధోరవలస, కృష్ణాపురం, మెట్టవలస తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు : ఎమ్మెల్యే

కొత్తవలస: గవరపాలెం గెడ్డను పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తవలస: లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే లలిత కుమారి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని టిడిపి నాయకులతో కలిసి పర్యటించారు. కొత్తవలస విశాఖ రహదారిలో అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో తహశీల్దార్ అప్పలరాజు, కొత్తవలస మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు గొరపల్లి రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలవ పూడికతీత పనులు దగ్గరుండి పరిశీలించారు.మండలంలోని కంటకాపల్లి, కాటకాపల్లి, తుమ్మికాపల్లి, వీరభద్రపురం గ్రామాల్లో ఎఒ కెవి రామ్ ప్రసాద్ వరి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

మండలంలోని ఐదు ముంపు ప్రాంతాలను గుర్తించామని సిఐ షణ్ముఖరావు, ఎస్ఐ జోగారావు తెలిపారు. గవరపాలెం గెడ్డ వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ పోలీస్ బందోబస్తుని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశామన్నారు. గనిశెట్టిపాలెం, దెందేరు, సంతపాలెం, గలివెందుల వైపు వెళ్లే ప్రయాణికుల నిలిపివేశామన్నారు.

వాహనాలు దారి మళ్లింపు

దత్తిరాజేరు: మండల పరిధిలో గల పాచలవలస, చెరుకుపల్లి గ్రామాల పోతుల గెడ్డ నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఎస్ బూర్జివలస ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో వెళ్లి వాహనాలను దారి మళ్లించారు. షికారు గింజి జంక్షన్ వద్ద భారీకేడ్లు అడ్డు పెట్టి వాహనాలను రామచంద్రపురం వద్ద దారిమళ్లించారు.

ఏడొంపులగెడ్డ పరిశీలన

రామభద్ర పురం: మండలంలోని కొండకెంగువ ఏడొంపుల గెడ్డను మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంత కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీ జాన్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. బూసాయవలస గ్రామంలో ఎంపిడిఒ రత్నం పర్యటించి గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మామిడివలసలో నీట మునిగిన వరిపంట

మామిడివలస గ్రామంలో వరిపంట నీట మునిగింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలతోపాటు కూరగాయల వంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పంట పొలాలను మండల వ్యవసాయాధికారి అమరాశివ పరిశీలించారు.

వాహనాలు దారి మళ్లింపు

పారాది తాత్కాలిక వంతెనపై మరలా నీటి ప్రవాహం పెరగడంతో బొబ్బిలి, పార్వతీపురం వెళ్లాల్సిన వాహనాలను రామభద్రపురం వద్ద మళ్లించారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

తెర్లాం: కాలువను పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

పునరావాస కేంద్రాలకు తరలింపు

శృంగవరపుకోట : సంత గౌరమ్మపేట, పోతనపల్లి, మూల బొడ్డవర, ముసిడిపల్లి, భర్తపురం ఎస్‌టికాలనీ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ గుండ ప్రవహించే పుణ్యగిరి గెడ్డ పొంగి ప్రవహించడంతో కాలనీలోని గుర్రపు కోనేరు వద్ద ఇళ్లల్లోకి గెడ్డ నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. జామి పట్టణంలోని గంగిరెడ్ల కాలనీ వద్ద చెరువు పూర్తిగా నిండడంతో నీరు పూనీ కాలనీని తాకింది. పోతనపల్లి, సంత గౌరమ్మపేట గ్రామాలలో ముంపు ప్రాంతాలలో ఉన్న వారిని సంత గౌరమ్మపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. పోతనపల్లి గ్రామానికి చెందిన ముచ్చం నాయుడు ఏర్పాటు చేసిన దుప్పట్లను తాహశీల్దార్ శ్రీనివాసరావు బాధితులకు పంపిణీ చేశారు.

నెల్లిమర్ల: ఎటి అగ్రహారంలో నేలమట్టమైన వరిచేను

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోళ్ల

పోతనపల్లి స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పరిశీలించారు. 40 కుటుంబాలకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు.

నేలకు ఒరిగిన వరి పంట

గజపతినగరం: మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంట నేలకు ఒరిగింది. మంగళవారం ఉదయం భారీ గాలులతో కుండ పోత వర్షం కురవడంతో పలుచోట్ల కోత దశలో ఉన్న వరి పంట నేలమట్టమైంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులు, అధికా రులు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పంట నష్టపరిహారం చెల్లించడంతోపాటు, తడిచిన వరి పంట కొనుగోలు చేసేందుకు ఇబ్బం దులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్తబగ్గాం, పాత బగ్గాం, కోనిస, చిట్టివలస, సాలిపేట, బంగారమ్మ పేట, భూదేవి పేట, గంగుచోళ్ళ పెంట, మరుపల్లి తదితర గ్రామాలలో చాలావరకు చెరువు కంచిక ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని మద్రివలస, తుమ్మకాపల్లి, లోగిస, కెంగువ, ముచ్చర్ల తదితర గ్రామాలలో ఎస్ఐ కిరణ్‌కుమార్ పర్యటించి గ్రామస్తులను అప్రమత్తం చేశారు.

చెరువు గట్లు పరిశీలన

నెల్లిమర్ల: కొత్తపేట ఎర్ర చెరువు గట్టును ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు పరిశీలించి గట్టు జారుతున్నట్లు గుర్తించి వెంటనే జంగల్ క్లియరెన్స్ జరిపి మట్టి వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చెరువుల పరిస్థితి పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలి

సొంత ఇళ్ళు లేని వారు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి. జయరాం కోరారు. మంగళవారం వారు నగర పంచాయతీ పరిధి జ్యూట్‌మిల్ వద్ద ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఉన్న పేదలను సందర్శించి వారిని తుపాను పునరావాస కేంద్రానికి రావాలని కోరారు.

ఎటి అగ్రహారంలో మీసాల శ్రీనుకు చెందిన రెండు ఎకరాలు వరిపంట నీట మునిగింది. గాలికి వరిపంట చాపచుట్టి నేలకొరిగింది. వర్షాలు ఇంకా ఎక్కువైతే పంట చేతికి రాదు సరికదా నట్టేట మునగడం ఖాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముంపు ప్రాంతాల్లో శాశ్వత పరిస్కారం చూపాలి: సిపిఎం

విజయనగరం టౌన్ : నగరంలోని ముంపు ప్రాంతాల్లోను, పేదల కాలనీల్లోను ప్రధాన కాలువలు నిర్మించి ఇళ్లల్లోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేసారు. తుపానుతో కురుస్తున్న వర్షాలకి ముంపునకు గురైన రామకృష్ణానగర్, ఎల్‌బిజి నగర్, గురజాడ నగర్, వినాయక నగర్, జొన్న గుడ్డి, బుంగవీధి ప్రాంతాల్లో మంగ ళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి సిబ్బందిని తెప్పించి కాలువలు తీయిం చారు. రామకృష్ణ నగర్ కార్యదర్శి శాంతమూర్తి, ఐద్వా ఉపాధ్యక్షులు జగదాంబ, ఎల్‌బిజి నగర్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి.రమణ పాల్గొన్నారు.

నిండు కుండలా చెరువులు

విజయనగరం టౌన్: నగర పరిధిలోని పెద్ద చెరువు, నీలాటి చెరువు, కోమటి చెరువు నిండుకుండలా ఉన్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రధాన కాలువల గుండా నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించే ప్రక్రియను పర్యవేక్షించారు. నాయుడు కాలనీలోని వినాయక నగర్ ప్రాంతాలలో అడ్డంకులను తొలగించారు. లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు సమీపంలో పెద్ద చెరువు అవుట్ ఫ్లో కాలువ ప్రవాహానికి కూడా అడ్డంకులు లేకుండా జెసిబి సహాయంతో అవసరమైన చర్యలను చేపట్టారు.

రైల్వే ప్రయాణికుల కోసం ప్రత్యేక టీమ్‌లు

బొబ్బిలి : రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసినట్లు ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రపండా చెప్పారు. రైల్వే స్టేషన్లో మంగళవారం టీమ్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ రైలు ప్రయాణికులు భోజనం, తాగునీరు లేక ఇబ్బందులు పడితే వారికి వాటర్ బాటిల్స్, భోజనాలు, బిస్కెట్ ప్యాకెట్స్ అందిస్తామని చెప్పారు. రైల్వే ట్రాక్ డామేజ్ అవ్వకుండా పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

బెటాలియన్‌లో మెగా వైద్య శిబిరం

దెంకాడ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చింతలవలస 5వ బెటాలియన్‌లో మెగా వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బెటాలియన్ కమాండెంట్ సిహెచ్‌విఎస్ పద్మనాభరాజు సమక్షంలో యూనిట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో వివిధ విభాగాల నిపుణ వైద్యులు సేవలు అందించారు. 131 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా మరో 51 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని విశాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికి వితరణ

దెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన మూగంటి రమణ కుమార్తె వివాహం కోసం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు మోపాడలో తన స్వగృహం వద్ద మంగళవారం రూ.15 వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంక లక్ష్మణరావు, రెండో వార్డ్ నెంబర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులోని గాంధీ బొమ్మ దగ్గర మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మారుతీ కాలనీకి చెందిన బండారు చిన్నారావు రోడ్డు పక్కన నిలుచొని ఉండగా ఒడిషా నుంచి బాడంగి వైపు వెళుతున్న లారీ అతనిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి పోలీసులు కేసు నమోదుచేశారు.

తగాదాలు లేకుండా భూ రీసర్వే చేయాలి

ప్రజాశక్తి- దత్తరాజేరు

గ్రామాల్లో రైతులకు ఎటువంటి తగాదాలు సమస్యలు రాకుండా భూముల రీ సర్వే చేయాలని ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. వింధ్యవాసి గ్రామంలో భూ రీ సర్వే కొలతలు సరిగ్గా చేపట్టలేదని సర్పంచ్ రంభ చంద్రశేఖర్ మండల సర్వేయర్‌ను నిలదీశారు. తహశీల్దార్ స్పందించి మీ భూమిని మళ్లీ సర్వే చేయించి హద్దులు కొలతలు కొలిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్ నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఓక్లాండ్ స్కూల్ సాయం

పూసపాటిరేగ: తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి స్థానిక పిహెచ్‌సికి తరలించిన గర్భిణులకు బేతని మిషన్ సొసైటీకి చెందిన ఓక్లాండ్ పాఠశాల యాజమాన్యం భోజన ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ప్రమీలదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు గర్భిణులకు అవసరమైన భోజన సదుపాయం కల్పించేందుకు బేతనీ మిషన్ సొసైటీ, ఓక్లాండ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ముందుకు వచ్చాయన్నారు. ఓక్లాండ్ స్కూల్ కరస్పాండెంట్, ప్రెసిడెంట్ డాక్టర్ పాల్ శ్రీనివాస్ చేపా మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్య మవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బాలుర వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని తిరుమల గ్రామంలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఎంఇఒ త్రినాధ రావు సందర్శించారు. తుపాను నేపథ్యంలో వార్డెన్ కృష్ణమూర్తికి తగు సూచనలు చేశారు. విద్యార్థులను హాస్టల్ నుంచి బయటికి వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఏపీ మోడల్ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌సి, బిసి వసతి గృహాల భవనాలు బాగోలేని కారణంగా విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లి పోతామని చెప్పగా వారి దగ్గర నుంచి లెటర్లు తీసుకుని తల్లిదండ్రులకు జాగ్రత్తగా అప్పగించాలని సూచించారు.

గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహం సందర్శన

వేపాడ: మండలంలోని కేజీపూడిలోని గిరిజన బాలుర ఆశ్రమ వసతి గృహాన్ని ప్రత్యేకాధికారి లక్ష్మి నరసింహ సందర్శించి సమీక్ష నిర్వహించారు. తుపాను పట్ల చేపట్టాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎంఆర్‌ఒ జె.రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, తదితరులు

గంట్యాడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఏఎస్‌డబ్ల్యూఒ స్వరూపకుమారి ఆకస్మికంగా సందర్శించారు. తుపాను నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వసతి గృహ సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఒ గొర్లె గోవింద సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి రూ.8.50కోట్లు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శిథిలావస్థకు గురైన కోర్టు భవన నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు రూ.8.50కోట్లకు పరిపాలనా ఆమోదం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత వెల్లడించారు. మంగళవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, సెక్రటరీ బివిఎస్ రామారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి హైకోర్టు జారీ చేసిన పరిపాలన ఆమోద ఉత్తర్వుల కాపీని ఆమెకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి న్యాయవాదుల సమక్షంలోనే రాష్ట్ర లా సెక్రటరీకి ఫోన్ చేసి ఎస్.కోట కోర్టుకు హైకోర్టు జారీ చేసిన పరిపాలన ఆమోదం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నిధులు మంజూరు చేసేలా చర్చించారు. త్వరలోనే రాష్ట్ర లా సెక్రటరీని ఎస్.కోట న్యాయవాదులతో కలిసేందుకు ఎమ్మెల్యే లలితకుమారి అనుమతి కోరారు. ఎమ్మెల్యే లలితకుమారిని కలిసిన వారిలో ప్రభుత్వ సహాయ న్యాయవాది టివిఆర్ మూర్తి, మాజీ ఎజిపి నానిగిరి తులసీ వివేకానందదాస్, న్యాయవాదుల సంఘ జాయింట్ సెక్రటరీ బడబల్ల రామకృష్ణ, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్.శర్మ, లైబ్రరీ సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఎం.దొరబాబు, బి.సత్యనారాయణ, నెక్కళ్ల సత్యనారాయణ, ముసిరాన శివ తదితరులు ఉన్నారు.

ఇవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టు పక్కల పరిస్తితులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోడి ఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, నెల్లిమర్ల తహశీల్దార్ కె.శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎలక్షన్ డిటి వివిఆర్ జగన్నాధరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - గజపతినగరం

గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా మండల కేంద్రంలో మురుగు కాలవల్లో నీరు నిల్వ లేకుండా గ్రీన్ అంబాసిడర్ల సహాయంతో మంగళవారం పారిశుధ్య పనులను యుద్ధ ప్రతిపాదికన నిర్వహించారు. గజపతినగరం ప్రధాన కూడలి, మెంటాడ రోడ్డులో మురుగు కాలువలో పూడిక తీత పనులను ఎంపిడిఒ బి.కళ్యాణి పరివేక్షించారు.